www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 07 ఏప్రిల్ 2023

ఎస్సైగా నరేష్ కుమార్ బాధ్యతల స్వీకరణ

హాజీపూర్ : ఎస్సైగా జార్తి నరేష్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలానికి చెందిన ఈయనది 2014 ఎస్సై బ్యాచ్. గతంలో వరంగల్ శాయంపేట, కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో ఎస్సైగా పని చేశారు. తాజా బదిలీల్లో భాగంగా గోదావరిఖని వన్‌టౌన్ నుంచి ఇక్కడికొచ్చారు. ఈ సందర్భంగా నరేష్‌కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతల రక్షణే లక్ష్యంగా పని చేస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో తనవంతు బాధ్యతగా పని చేస్తానని తెలిపారు. పోలీసులు ఉన్నది ప్రజల కోసమేనని, మండలంలో ఎవరైన తమ సమస్యలను నేరుగా సంప్రదించి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన ఉదయ్ కిరణ్ రామగుండం కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు.



అదుపుతప్పి వాగులో పడ్డ అంబులెన్స్

జైనథ్ : అదుపుతప్పి ప్రయివేట్ అంబులెన్స్ వాగులో పడిన ఘటన గురువారం తరోడ వద్ద నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..తరోడ వంతెన శిథిలావస్థకు చేరుకోగా వాగులోంచి ప్రత్యేక రోడ్డు సౌకర్యం కల్పించారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు జైనథ్ మీదుగా మృతదేహాన్ని తరలిస్తున్న క్రమంలో అంబులెన్స్ అదుపుతప్పి నీటిలో పడిపోయింది. ఆ వాహనంలో మృతదేహంతో పాటు నలుగురు వ్యక్తులు ఉండగా అందరూ సురక్షితంగా బయటపడ్డారు. క్రేన్ సాయంతో వాహనాన్ని బయటకు తీశారు.




పరిహారంపై గుబులు..!

- పంట నష్టం గుర్తింపులో అధికారుల అలసత్వం
- సక్రమంగా నమోదు చేయడం లేదని అన్నదాతల ఆవేదన
- వెయ్యి ఎకరాల్లో నష్టం జరిగినట్లు గుర్తింపు
- సర్కారు సాయంపై బాధిత రైతుల్లో ఆందోళన

పంట ఎదిగే క్రమంలో వచ్చిన వడగండ్ల వర్షం అన్నదాతలను నిండా ముంచింది. ఇప్పటికే ఖరీఫ్‌లో జరిగిన నష్టం మరువకముందే రబీలోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం అన్నదాతలను ఉక్కిరిబిక్కిరి చేసింది. పెట్టిన పెట్టుబడి అంతా నేలపాలు కావడంతో ఆర్థిక నష్టాలకు గురయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం వీరిని ఆదుకోవడానికి ముందుకొచ్చి ఎకరానికి రూ.10వేల నష్టపరిహారం చెల్లిస్తామని ప్రకటించింది. ఈ పరిహారంపై అన్నదాతల్లో ఆశలు చిగురించగా.. అధికారుల అలసత్వ వైఖరి కారణంగా తమకు దక్కుతుందా లేదా అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట గుర్తింపు సర్వే సక్రమంగా చేపట్టడం లేదని క్షేత్రస్థాయిలో పర్యటించకుండా వివరాలు నమోదు చేస్తున్నారని చెబుతున్నారు. అనుకూలమున్న రైతుల పేర్లను రాస్తూ..మిగిలిన వారిని పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బోథ్ మండలం కన్గుట్ట గ్రామానికి చెందిన ఈ రైతు పేరు కుమ్మరి ప్రభాకర్. యాసంగిలో 2.28 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. పంట చేతికొచ్చే సమయంలో వచ్చిన వడగండ్ల వర్షం పంటను నేలపాలు చేసింది. దీంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం రావాల్సి ఉండగా అధికారులు సర్వే చేయలేదని చెబుతున్నారు. ఇలాంటి బాధిత రైతులు అనేక మంది ఉన్నారు.





బోథ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి పంటలు నేలరాలిపోయి అన్నదాత కన్నీరు కార్చాడు. ఇది వరకు ఖరీఫ్‌లోనూ అధిక వర్షాల కారణంగా పంటలు నష్టపోయి, దిగుబడి తగ్గిపోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు తాజా యాసంగి పంట కూడా కలిసిరాలేని పరిస్థితి వచ్చింది. వేసవి ప్రారంభంలో వచ్చిన వడగండ్ల వర్షం ఏపుగా ఎదిగిన మొక్కజొన్న, జొన్న, నువ్వులు, ధనియాల సాగుతో పాటు కూరగాయల పంటలన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగండ్ల దాటికి కుప్పకూలడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్‌లో జరిగిన నష్టానికి ఎలాంటి పరిహారం రాకపోవడంతో యాసంగి నష్టంపైనా ఆశలు వదులుకున్నారు. కానీ ఈ వడగండ్ల బాధితులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పరిహారం ప్రకటించారు. ఎకరానికి రూ.10వేల చొప్పున అందజేస్తామని ప్రకటించడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. పంటల గుర్తింపు సర్వే చేపట్టాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

గుర్తింపు సర్వేలో అలసత్వం..!

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33శాతంపైగా పంట నష్టపోతే సదరు పంటకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇటీవల జిల్లాలోని బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ మండలాల్లో సుమారు ఏడు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని రైతులు అంచనా వేశారు. కానీ అధికారిక సర్వేలో మాత్రం ఇప్పటి వరకు కేవలం వెయ్యి ఎకరాలను మాత్రమే అధికారులు గుర్తించడంతో అన్నదాతల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. కేవలం కన్గుట్ట క్లస్టర్ పరిధిలోనే సుమారు 1800 ఎకరాలకు పైగా నష్టం వాటిల్లిందని..మిగతా సొనాల, సాంగ్వి, కౌట, కుప్టి తదితర గ్రామాల్లోనూ పెద్ద ఎత్తున నష్టం జరిగిందని చెబుతున్నారు. కానీ ఏఈఓలు క్షేత్రస్థాయిలో వెళ్లి ఎంత పంట నష్టం జరిగింది.. ఏయే పంటలు వేశారు. ఎన్ని ఎకరాలు తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉండగా ఒక చోట కూర్చొని ఆయా వివరాలను నమోదు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఫలితంగా పంట నష్టం వాస్తవ వివరాలు నమోదు చేయకపోవడం మూలంగా అనేక మంది రైతులకు అన్యాయం జరిగే అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కొందరు అనుకూలమైన రైతుల పేర్లనే నమోదు చేస్తున్నారని మిగితా వారిని పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం క్షేత్రస్థాయిలో ఈ సర్వేపై దృష్టిసారించడం లేదని ఫలితంగా అనేక మంది బాధిత రైతులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టపోయిన రైతులందరికీ అందించాలి : సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్యవేదిక అధ్యక్షులు



వడగండ్ల వర్షం కారణంగా యాసంగిలో పంటలు నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం అందించాలి. జిల్లాలో సుమారు ఏడు వేల ఎకరాల్లో పంట నష్ట జరిగిందని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించకుండా వివరాలు నమోదు చేశారు. పారదర్శకంగా సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించి ఆదుకోవాలి.

నష్టం జరిగిన పంటలను నమోదు చేశాం : పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఆదిలాబాద్

జిల్లాలో వడగండ్ల వర్షంతో నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో గుర్తించి వివరాలు తీసుకున్నాం. వెయ్యి ఎకరాల వరకు నష్టం జరిగినట్లు గుర్తించాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే సర్వే చేపట్టాం. రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపిస్తాం.

భారత కార్మికోద్యమ నాయకుడు బీటీ రణదివే

- సీఐటీయూ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్



నవతెలంగాణ-మంచిర్యాల

భారత కార్మికోద్యమ నాయకుడు బిటి రణదివే అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. సీఐటీయూ వ్యవస్థాపకులు రణదివే 33వ వర్ధంతిని గురువారం సంఘం కార్యాలయంతో పాటు ఐబీ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్ వద్ద వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ రణదివే దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసినట్లు తెలిపారు. బ్రిటిష్ కాలంలోనే కార్మిక సంఘాలను ఏర్పాటు చేసిన ఆదర్శ నాయకుడు అని, కార్మికుల ప్రయోజనాలే తప్ప సొంత జీవితం పట్ల ఆసక్తి లేని నేత అని గుర్తు చేశారు. తన జీవితమంతా కార్మికవర్గ ఐక్యత కొరకు కృషి చేసినట్లు వివరించారు. 1970లో సీఐటీయు ఆవిర్భావ అధ్యక్షులుగా 20 ఏండ్లు పని చేశారని, 1974 రైల్వే కార్మికులను ఐక్యం జాతీయ సమన్వయ కమిటీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. 1974లో జరిగిన రైల్వే కార్మికుల సమ్మె దేశ కార్మిక ఉద్యమంలో చరిత్ర సృష్టించిందని తెలిపారు. 1979లో మోరార్జీ ప్రభుత్వం తెచ్చిన పారిశ్రామిక బిల్లుకు వ్యతిరేకంగా కార్మికులను, ఉద్యోగులను ఐక్యంగా కదిలించి, కార్మిక సంఘాల జాతీయ ఉద్యమ కమిటీని ఏర్పాటు చేయడంలో ముఖ్య పాత్ర పోషించారని తెలిపారు. బీటీఆర్ మన మధ్యలో లేకపోయినా ఆయన వదిలి వెళ్లిపోయిన ఆశయాలు ఇంకా మన మధ్యలోనే ఉన్నట్లు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విశాల ఐక్య కార్మికోద్యమాన్ని నిర్మించడమే ఆయన ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరిగెల మహేష్, కె. ప్రేమ్‌కుమార్, డివైఎఫ్ఐ నాయకులు దుర్కే మోహన్, జిల్లా కార్యదర్శి నరేష్, ఇవంత్, పోసమ్మ పాల్గొన్నారు.

నస్పూర్ : బీటీ రణదివే పోరాట స్ఫూర్తితో 4లేబర్ కోడ్స్ రద్దుకు పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సీఐటీయూ వ్యవస్థాపకులు బిటి రణదివే 33వ వర్ధంతిని గురువారం శ్రీరాంపూర్ ఓసి, నర్సరీ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌కేబీఎస్ బెల్లంపల్లి రీజినల్ అధ్యక్ష కార్యదర్శులు దూలం శ్రీనివాస్, కుమారి, లక్ష్మి, కన్వెయన్స్ డ్రైవర్స్ శివ, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ నాయకులకు కమీషన్ల మీదనే శ్రద్ధ

నవతెలంగాణ - రెబ్బెన

టీబీజీకేయస్ నాయకత్వానికి కమీషన్‌ల మీద ఉన్న శ్రద్ధ కార్మికుల మీద లేదని హెచ్ఎంఎస్ ఖైరిగూడ ప్రెసిడెంట్ పత్యం రాజాబాబు, సెక్రటరీ ఎం శివారెడ్డి అన్నారు. గురువారం జీఎంఎస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి బెల్లంపల్లి ఏరియా ఎస్‌ఓటు జీఎం గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓసీలో సింగరేణి కార్మికులు తీయాల్సిన బొగ్గును జీఆర్ఎన్ ప్రయివేట్ ఓబీ కాంట్రాక్టర్‌తో తీయిస్తున్నారన్నారు. సింగరేణి కార్మికులు పని చేయడం లేదని నిందలు వేస్తున్నారన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏరియాలోని గోలేటి 1, 1ఎ అండర్‌గ్రౌండ్ మైన్‌లు టీబీజీయకేఎస్ చేతకాని తనం వల్లనే మూసివేశారన్నారు. ఇప్పుడు ఖైరిగూడ ఓసీని ప్రయివేటుకు అప్పగించి బెల్లంపల్లి ఏరియానే లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. యాజమాన్యం ఇప్పటికైనా ఖైరిగూడ ఓసీలో సింగరేణి కార్మికులతోనే బొగ్గు తీసే అవకాశం కల్పించాలని, లేనిపక్షంలో హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ ఒజియాజ్, సెంట్రల్ నాయకులు కోండ్ర శంకరయ్య, జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్, ఏరియా ఆర్గనైజర్ ఎస్‌కె ఇనూస్, ఫిట్ సెక్రటరీ రమేష్, ఎస్ అండ్ పీసీ ఫిట్ సెక్రటరీ ఎం శ్రీనివాస్, ఏరియా ఆస్పత్రి ఫిట్ సెక్రటరీ వినయ్‌కుమార్, గోలేటి ఆస్పత్రి ఇన్‌చార్జి ఆర్ శ్రీనివాస్, గోలేటి సీహెచ్‌పీ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ శశికుమార్, ఏరియా ఆర్గనైజర్ సంజీవ్, కనకయ్య, భిక్షపతి, బాలేష్, రాజేష్, దీపక్‌రాజ్ పాల్గొన్నారు.



రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించేలా కృషి



నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించేలా పూర్తి వసతులు అందుబాటులోకి తెచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. ఆస్పత్రిలోని సమావేశ మందిరంలో హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ మీటింగ్‌ను గురువారం ఏర్పాటు చేశారు. సమావేశానికి ట్రైనీ కలెక్టర్ శ్రీజ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం పెండింగ్ బిల్లులకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ మీటింగ్‌లో భాగంగా పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రోగులకు ఎటువంటి సమస్య ఉత్పన్నం కాకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఎస్పీ డి ఉదయ్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. కృష్ణవేణి, ఎస్ఆర్ డిజి, ప్రభుత్వ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించి కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాలను అనుసరిస్తూ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ పరీక్షా కేంద్రంలోని ఏ ఒక్క సిబ్బంది వద్ద సెల్‌ఫోన్ ఉండరాదని పరీక్షా కేంద్రం ఇన్చార్జికి తెలియజేశారు. పరీక్ష మొదలు కాకముందే సిబ్బంది సెల్‌ఫోన్లు బయట ఉంచే విధంగా చూడాలని సూచించారు. ఎస్పీ వెంట వన్‌టౌన్ సీఐ కె సత్యనారాయణ, మావల ఎస్ఐలు విష్ణువర్ధన్, ఇసాక్ ఉన్నారు.

దేవాలయాల నిర్మాణాలకు భూమిపూజ



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శ్యామ్‌నాయక్ తండాలో జగదాంబ, సేవాలాల్ దేవాలయాల నిర్మాణాలకు గురువారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రేఖా నాయక్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ సీఎం అయ్యాక అన్ని మతాలకు, కులాలకు సంబంధించిన దేవాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ గ్రామంలో నిర్మాణాలు చేపట్టే దేవాలయాలకు 50లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్, వైస్ ఎంపీపీ బాలాజీ, బంజారా సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ కపిల్, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ పరీక్ష కేంద్రాల తనిఖీ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను గురువారం తహసీల్దార్ కిషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును సమీక్షించారు. పరీక్ష రాయడానికి వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సెల్‌ఫోన్స్, ఇతర వస్తువులను అనుమతించకూడదని తెలిపారు. జిరాక్స్ సెంటర్లను మూయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్సై పి.సతీష్ ఉన్నారు.

హనుమాన్ దీక్షాపరుల ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ - భీమిని

లక్ష్మీపూర్ గ్రామ హనుమాన్ స్వాముల సౌజన్యంతో ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి, లక్ష్మణ్ సహకారంతో శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 41 వారాలుగా అన్నదానం కొనసాగుతోంది. కార్యక్రమంలో శ్రీరామ సేవా సమితి అధ్యక్షులు పోతురాజుల లక్ష్మణ్, పోతురాజుల తిరుపతి, శేఖర్, నవీన్, కోరాల రమేష్ పాల్గొన్నారు.

గొల్ల కుర్మల ఆర్థికాభివృద్ధికి బీఆర్ఎస్ కృషి

- జీపీవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్ యాదవ్



నవతెలంగాణ-జైపూర్

గతంలో ఏ ప్రభుత్వమూ గొల్ల కుర్మలను పట్టించుకున్న పాపానపోలేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ గొల్ల కుర్మలకు ప్రభుత్వ పరంగా ఆర్థిక తోడ్పాటు అందుతోందని గొర్రె మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్ యాదవ్ అన్నారు. ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ ఆదేశాల మేరకు శివ్వారం, కుందారం, వేలాల, కిష్టాపూర్ గ్రామాలలో గురువారం శివ్వారం సొసైటీ అధ్యక్షులు గెల్లు రాజన్న యాదవ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక తోడ్పాటు వివరిస్తూ 2వ దశ గొర్రెల యూనిట్లు ఈ నెల చివరికి పంపిణీ జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి సొసైటీల్లో సభ్యత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పాటుతో పాటు చెన్నూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన బాల్క సుమన్ చొరవతో నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, గ్రామ పంచాయతీల వారీగా సొసైటీలు ఏర్పాటు చేసుకోవాలని, 18 సంవత్సరాల వారికి సభ్యత్వం ఇవ్వాలని తెలిపారు. సొసైటీలకు యూనిట్లు పంపిణీ చేస్తామని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ సభ్యులు మాయ సమ్మయ్య, పోచన్న, సది, సంపత్, గెల్లు లక్ష్మణ్, మాయ కొమురయ్య, సల్పాల మహేందర్, శ్రీకాంత్, అంజి పాల్గొన్నారు.

జిజ్ఞాస రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు రూపొందించిన మూడు జిజ్ఞాస ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. తెలుగు విభాగం నుంచి సహాయ ఆచార్యులు రడారపు సంతోష్ కుమార్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు రూపొందించిన 'బుర్నూర్ గ్రామ సమగ్ర చరిత్ర, జువాలజీ విభాగంలో డాక్టర్ ఎం.నర్సింగ్‌రావు మార్గదర్శకత్వంలో 'స్టడీ ఆఫ్ ఎఫెక్ట్ ఆఫ్ పొల్యూషన్ ఆన్ ఫిజియో కెమికో పారామీటర్స్ ఆఫ్ చాంద వాగు వాటర్ నియర్ టు ఆదిలాబాద్ టౌన్' కంప్యూటర్ సైన్స్ విభాగంలో జి.విద్యారాణి మార్గదర్శకత్వంలో సెక్యూరిటీ మేనేజ్మెంట్ యూజింగ్ ఆత్ 2.0 ప్రాజెక్టులు జిజ్ఞాస రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. 2016 నుంచి కళాశాల విద్యాశాఖ డిగ్రీ విద్యార్థుల్లో పరిశోధనాశక్తిని, పరిశోధనాసక్తిని పెంపొందించడానికి ఈ పోటీలను నిర్వహిస్తోంది. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి 30వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి 21వేల నగదు బహుమతులను అందిస్తుంది. ఈ సంవత్సరం నిర్వహించిన జిజ్ఞాస జిల్లా స్థాయి పోటీల్లో మొత్తం 1129 ప్రాజెక్టులు రాగా అందులో నుంచి 16 సబ్జెక్టుల్లో 286 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఇందులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్ విద్యార్థులు మూడు సబ్జెక్టుల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను మార్గదర్శనం చేసిన అధ్యాపకులను అభినందించారు. రాష్ట్రస్థాయి బహుమతులు సాధించి కళాశాలకు పేరు తేవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, అధ్యాపకులకు కళాశాల అధ్యాపకులు ఇతర విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

చెత్త వాహనాలను అడ్డుకున్న కాలనీవాసులు



నవతెలంగాణ - మంచిర్యాల

మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు చెత్త డంపింగ్ యార్డ్‌లో చేపట్టిన సెప్టిక్ ట్యాంక్ డంపింగ్ యార్డు నిర్మాణ పనులను గురువారం అండాలమ్మ కాలనీ ప్రజలు అడ్డుకున్నారు. డంపింగ్ యార్డ్‌కు పట్టణంలోని వివిధ వార్డుల నుండి చెత్తాచెదారాన్ని తీసుకువచ్చే ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలను అడ్డుకొని నిరసన తెలిపారు. చెత్త డంపింగ్ యార్డ్‌తో ఇప్పటికే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో మున్సిపల్ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు తమకు ప్రాణాంతకంగా మారుతున్నాయని మండిపడ్డారు. సెప్టిక్ ట్యాంకుల డంపింగ్‌ను తక్షణమే నిలిపివేయాలని, లేదంటే తమ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్యను వివరణ కోరగా సెప్టిక్ ట్యాంకుల డంపింగ్ ఏర్పాటు పనులను నిలిపి వేసినట్లు వెల్లడించారు. వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునీత కిషన్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, సమ్మయ్య, బాబా, సదానందం, వెంకటేష్, వెంకన్న పాల్గొన్నారు.

పది పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలి

నవతెలంగాణ-జైపూర్

పది పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమో రాజేశ్వరి ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతించవద్దన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధి పోలీస్ అధికారులతో మాట్లాడి కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధుల్లో ఉన్న అధికారులు సైతం సెల్ ఫోన్లు తీసుకుపోకూడదని, ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలోకి ఎవరినీ రానివ్వకూడదని, కేంద్రాల చుట్టూ ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసి వేయించాలని ఆదేశించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులు, గుంపులుగా ఉండరాదని పేర్కొన్నారు.

ఇంటింటికీ బీజేపీ వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

ఎంచికల్‌పేట్ : మండల కేంద్రంలో పల్లెపల్లెకు ఓబీసీ, ఇంటింటికీ బీజేపీ వాల్‌పోస్టర్లను ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, బీజేపీ మండలాధ్యక్షుడు జునుగరి మధుకర్ నాయకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శక్తి బూత్ కేంద్రాల ఇన్‌చార్జీలు సంతోష్, కుకుడ రాజేశ్వర్, జునుగరి శంకర్, భీమయ్య, సాయి అనంత్‌రావు, గణపురం నాగేష్, నారాయణ పాల్గొన్నారు.

పోలీస్, ఎస్సై రాత పరీక్ష అభ్యర్థులకు ప్రత్యేక బస్సు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీస్, ఎస్సై రాత పరీక్ష కొరకు ఆదిలాబాద్ నుండి కరీంనగర్‌కు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సై రాత ఎగ్జామ్‌కి వెళ్లే అభ్యర్థుల కొరకు ఈనెల 8న శనివారం ఉదయం 03.30 గంటలకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు, అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌ఆర్టీసీఆన్‌లైన్.ఇన్ వెబ్ సైట్ లేదా ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్ బస్టాండ్ అదిలాబాద్‌లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలియజేశారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చని డీటీటీ పీఓ మనోహర్ అన్నారు. గురువారం స్థానిక కేబీ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో మండలంలోని ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలకు సీపీఆర్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు ఈ అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. నేటి సమాజంలో వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటుకు గురవుతున్నారని అన్నారు. గుండెపోటుకు గురై బాధితులకు అత్యవసరంగా సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏజెన్సీ వైద్యాధికారి బాలు, అధికారులు, వైద్యాధికారులు విజయ్, హరీష్, సందీప్, అనురాధ, రాంబాబు, విజయలక్ష్మి సిబ్బంది శ్రీనివాస్, గోకుల్ ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నవతెలంగాణ-లక్ష్మణచాంద

జిల్లా కలెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి గురువారం మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, క్రీడా ప్రాంగణం, సీసీ రోడ్డు, పంచాయతీ భవనం పరిశీలించారు. గ్రామ సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌లను అభినందించారు. మల్లాపూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలని సందర్శించి, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను, భోజనం, వంట గది, వసతులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కవితారెడ్డి, ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ నసీరుద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ చేనేత రాష్ట్ర యువజన సంఘం కార్యదర్శిగా బండ శ్రీనివాస్

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర యువజన సంఘం కార్యదర్శిగా పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన పద్మశాలి సంఘం యువజన నాయకుడు బండ శ్రీనివాస్ ఎన్నికైనట్లు ఆ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షులు రాపోలు వీర మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామక ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. జాతీయ చేనేత ఐక్య వేదిక ద్వారా ఆ కార్మికుల పరిరక్షణ, సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు.

తెలంగాణ అభివృద్ధే ధ్యేయం



నవతెలంగాణ-తలమడుగు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తెలిపారు. గురువారం ఖోడద్ గ్రామంలో మత్స్యకారుల సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. సంఘ భవనానికి తమవంతుగా రూ.5లక్షలు మంజూరు చేస్తానని అన్నారు. దేశంలో ఎక్కడ లేని సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకి ఆనంద్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, రైతుబంధు నాయకుడు గోక జీవన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు మహేష్, నర్సింలు, సంతోష్, సత్యనారాయణ, పల్లవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహ కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ



నవతెలంగాణ-నార్నూర్

దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ అధ్వర్యంలో ఎనిమిది నీరు పేద కుటుంబాల వివాహానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గురువారం గాదిగూడ మండలంలోని హీరాపూర్ గ్రామంలోని సామాన్య రైతు ఆత్రం లక్ష్మణ్ దంపతుల కుమార్తె దుర్పత బాయి ఈనెల 17న జరిగే వివాహానికి 150 కిలోల బియ్యం, 10 కిలోల పప్పు, 15 లీటర్ల నూనె నిత్యావసర సరుకులు అందించారు. దీనితో పాటు జైనూర్ కెరమెరి, సిర్పూర్(యు) మండలంలోని పలు గ్రామాల్లో ఏడుగురు పేద కుటుంబాల వివాహానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు తావు లేకుండా అన్ని వర్గాలకు సామాజిక సేవ చేయడమే తన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విశ్వప్రసాద్, ఫౌండేషన్ సభ్యులు పూసం సురేష్, సలాం మధు, మెస్రం చిన్ను, ముకుందరావు, మెస్రం జైతు ఉన్నారు.

వాయిపేట్ మహంకాళీ అమ్మవారిని దర్శించుకున్న జెడ్పీ చైర్మెన్

నవతెలంగాణ-సిరికొండ



మండలంలోని వాయిపేట్ గ్రామంలో కొలువైన మహంకాళీ అమ్మవారిని గురువారం జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ దర్శించుకున్నారు. జాతర ప్రారంభం కావడంతో ఆయా మండలాల నుంచే కాకుండా జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ పూజారి కినక శంభు మహరాజ్ అధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్ పోటీలను చైర్మెన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి గంగాధర్, ఎంపీటీసీ మారుతి, బారిక్ రావ్, గంగాసాగర్, ఆనంద్ రావ్, విఠల్ పాల్గొన్నారు.

కార్మికవర్గ ఐక్యతకు బీటీఆర్ కృషి

- సీఐటీయూ ఆధ్వర్యంలో బీటీ రణదివే 33వ వర్ధంతి



నవతెలంగాణ-నిర్మల్

కార్మికవర్గ ఐక్యతకు కృషి కార్మికులను ఏకం చేసిన వ్యక్తి బీటీ రణదీవేనని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు రాజమణి, లలిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో, ఐబీచౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్‌లో వేర్వేరుగా సీఐటీయూ వ్యవస్థాపకులు బీటీ రణదీవే 33వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఉపాధ్యక్షులు రాజమణి, లలిత మాట్లాడారు. బీటీ రణదీవే 1904 సంవత్సరంలో మహారాష్ట్రలోని ముంబాయిలో జన్మించారని అన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని అన్నారు. బ్రిటిష్ కాలంలోనే కార్మిక సంఘాలను నెలకొల్పారని, అన్నారు. కార్మికుల ప్రయోజనాలే తప్ప సొంత జీవితం పట్ల ఆసక్తి లేని నేత బీటీఆర్ అని, తన జీవితమంతా కార్మికవర్గ ఐక్యత కొరకు కృషి చేశారని కొనియాడారు. 1970లో సీఐటీయూ ఆవిర్భావ అధ్యక్షులుగా 20 సంవత్సరాలు పని చేశారని అన్నారు. 1974 రైల్వే కార్మికులను ఐక్యం చేసి, రైల్వే కార్మికుల పోరాట జాతీయ సమన్వయ కమిటీ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారని అన్నారు. 1974లో జరిగిన రైల్వే కార్మికుల సమ్మె భారతదేశ కార్మిక ఉద్యమంలో చరిత్ర సృష్టించిందని అన్నారు. 1979లో మొరార్జీ ప్రభుత్వం తెచ్చిన పారిశ్రామిక బిల్లుకు వ్యతిరేకంగా కార్మికులను, ఉద్యోగులను ఐక్యంగా కదిలించి, కార్మిక సంఘాల జాతీయ ఉద్యమ కమిటీని ఏర్పాటు చేయడంలో ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. శ్రామిక మహిళా సమస్యలపై ప్రత్యేక పోరాటాలు అవసరమని దానికోసం 1979 చెన్నైలో మొట్టమొదటి శ్రామిక మహిళ సదస్సును నిర్వహించారని అన్నారు. వివిధ సందర్భాలలో భారత కార్మికోద్యమానికి దిశా, నిర్దేశం చేయడంలో ఉపాధ్యాయుడు పాత్ర పోషించారన్నారు. దేశంలోనే రైతులు, ప్రజలు, కార్మికులు అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించిన ఆదర్శ విప్లవకారుడని కొనియాడారు. బీటీ రణదీవే 1990 ఏప్రిల్ 06న కన్ను మూసేంతవరకు అవిశ్రాంత పోరాటమైసాగిన కమ్యూనిస్టు యోధుడని అన్నారు. బీటీఆర్ మన మధ్యలో లేకపోయినా ఆయన వదిలి వెళ్లిపోయిన ఆశయాలు ఇంకా మన మధ్యలోనే ఉన్నాయని అన్నారు. నాడు ఎన్నో త్యాగాలతో తెచ్చుకున్న కార్మిక చట్టాలు, హక్కులు నేడు పాలకుల విధానాలతో కాల రాయపడుతున్నాయని విమర్శించారు. ప్రజలపై మరిన్ని భారాలు పెరుగుతున్నాయని, ఒకపక్క కార్పొరేట్‌ల, పెట్టుబడిదారుల ఆస్తులు ఒకటికి రెండింతలు పెరుగుతున్నాయని అన్నారు. మరోపక్క పేదరికం, ఆకలి చావులు, నిరుద్యోగం, రైతంగం ఆత్మహత్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విశాల ఐక్య కార్మికోద్యమాన్ని నిర్మించడమే మనం బీటీఆర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమం నాయకులు రమ్య, లావణ్య, సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ ప్రశాంత జీవనాన్ని గడపాలి

- ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ ప్రశాంత జీవనాన్ని గడపాలని, ఆలయాభివద్ధికి తమ వంతుగా పూర్తి సహాయ సహకారాలు అందచేయడంతో పాటు ప్రభుత్వం నుండి నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలోని దత్త మందిర్ పునర్ నిర్మాణం కోసం గురువారం భూమిపూజ చేశారు. మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ఎమ్మెల్యే ఆలయ పునర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అంతకుముందు కార్యక్రమ ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరికి హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీలలో ఆలయాల నిర్మాణాలకు ప్రజలు ముందుకు రావడం పట్ల అభినందనలు తెలిపిన ఆయన సన్మార్గంలో నడుస్తూ మానసికంగా ప్రశాంత జీవనాన్ని గడపాలని సూచించారు. దత్త మందిర్ పునర్ నిర్మాణం కోసం తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని భరోసా కల్పించారు. ఆలయాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ అశోక్ స్వామి, జైనథ్ ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ప్రహ్లాద్, రామేశ్వర్ పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో గుప్త నిధుల కలకలం..!

- పట్టణ శివారులో అనుమానాస్పదంగా తవ్విన గుంత

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణ శివారులో గురువారం గుప్తనిధుల తవ్వకాల ఆనవాళ్ల ఉండటంతో ఖానాపూర్‌లో కలకలం రేపాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ పట్టణ శివారు తర్లపాడు గ్రామాల మధ్య ఉన్న ఓ రైతుకు సంబంధించిన భూమిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగినట్లు ఆనవాళ్ల కనిపించాయి. పొలంలో అనుమానాస్పదంగా గుంత తవ్వి ఉండటం ఘటన స్థలంలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, అగర్బత్తులు ఉన్నాయని, రైతు చిన్న మల్లేష్ తెలిపారు. ఉదయం వ్యవసాయ పనుల కోసం ఎప్పటిలాగే పొలంలోకి వెళ్లి చూసేసరికి ఈ తవ్వకాలు ఉన్నాయని దీన్ని చూసి ఒకసారి భయభ్రాంతులకు గురైనట్లు తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు, రెవెన్యూ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు, రెవెన్యూ శాఖ



అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారు.

ముధోల్‌లో ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

- తిలకించడానికి తరలివచ్చిన స్థానికులు



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని జరశంకర ఆలయ ప్రాంగణంలో గురువారం వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలు అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నిర్మల్ జిల్లాలోని వివిధ మండలాలతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు చెందిన మల్ల యోధులు కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. చివరి వరకు నువ్వా నేనా అనే రీతిలో కుస్తీ పోటీలు సాగాయి. చివరి పోటీలో గెలుపొందిన విజేతకు రూ.5వేల నగదు బహుమతిని అందజేశారు. హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం వీడీసీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కుస్తీ పోటీలను తిలకించడానికి చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తరలివచ్చారు. కుస్తీ పోటీల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానికుల సౌకర్యార్థం అంబలిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, ఎంపీటీసీ దేవోజి భూమేష్, సరళ శ్రీనివాస్‌గౌడ్, వీడీసీ అధ్యక్షులు గుంజలోల్ల నారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, మాజీ ఎంపీపీ ఎజాజోద్దీన్, వీడీసీ ఉపాధ్యక్షుడు ఆనందరావు పటేల్, కార్యదర్శి నారాయణ, కోశాధికారి మేత్రి సాయినాథ్, సంయుక్త కార్యదర్శి మోహన్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే డీఎంను కలిసిన మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఇటీవల నాందేడ్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన సునితి సర్కార్ గురువారం ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. రైల్వే స్టేషన్‌లో అందుబాటులో ఉన్న వసతుల వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించి, స్థానికంగా జరుగుతున్న పనుల తీరును పర్యవేక్షించారు. రైల్వే స్టేషన్ సంబంధిత వివరాలను స్థానిక అధికారులు ఆమెకు వివరించగా వారికీ అవసరమైన సూచనలు చేశారు. కాగా మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ రైల్వే డీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. రైల్వే పట్టాలకు అవతల వైపు ఉన్న ప్రజల సౌకర్యార్థం ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం విషయమై చర్చించి, పలు సూచనలు చేశారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి సంబంధించి రైల్వే, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు సర్వే నిర్వహించారని పేర్కొన్నారు. ఆయా కాలనీల ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం విషయాన్నీ ఎమ్మెల్యే జోగు రామన్న దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయించేలా కృషి చేస్తామని తెలిపారు. అందుకు



సంబంధించిన డీపీఆర్ నివేదికను సైతం రూపొందించి రైల్వే అధికారులకు అందచేయనున్నట్లు పేర్కొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

సీఎం కేసీఆర్ పాలనదక్షతలో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలుస్తోందని మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. లబ్దిదారులకు చెక్కులను అందచేసి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల సరళిని వివరించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మెన్ జహీర్ రంజాని మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారధ్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ ప్రజలకు వరంలా మారాయని అన్నారు.

కోట్లాది రూపాయల నిధులను ప్రజా సంక్షేమం కోసం వెచ్చిస్తూ, వారి ఇక్కట్లను తీరుస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రవేశపెట్టిన అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఇతర రాష్ట్రాల నుండి సైతం విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. సమగ్ర అభ్యున్నతికి పాటు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ గణేష్, మిషు, మంచాల మల్లయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్ గ్రామంలో సర్పంచ్ కొప్పుల లక్ష్మీ లచ్చన్న గురువారం లబ్దిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొప్పుల లక్ష్మీలచ్చన్న మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తెలంగాణలో అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఊరు ప్రతిగడపకు ప్రతి ఒక్కరికి అందుతున్నాయని అన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను లబ్దిదారులకు అందించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ గ్రామ అధ్యక్షులు మిల్కురి సత్తన్న, స్వామి, నాయకులు పాక భూమన్న, వార్డ్ మెంబర్ భూస నగేష్, లింగన్న, భూమన్న పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఆలయాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాబాపూర్ భీమన్న ఆలయ అభివృద్ధి కొరకు రూ.15 లక్షలు, ధర్మారం ఆలయానికి నూతన షెడ్ నిర్మాణనికి రూ.50 లక్షలు, బోరిగాం హనుమాన్ ఆలయానికి సీసీరోడ్డు, ప్రహరీ గోడ నిర్మాణనికి రూ.12 లక్షలు, మల్లాపూర్ హనుమాన్ ఆలయానికి రూ.15 లక్షలు మంజూరు అయినట్లు జెడ్పీటీసీ తెలిపారు. త్వరలో పనులు ప్రారంభం అయ్యేలా చూస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

దుప్పట్ల పంపిణీ



నవతెలంగాణ-నార్నూర్

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బీజేపీ నాయకులు రోగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. జాతీయ పార్టీగా ఉన్న బీజేపీ పార్టీ ప్రజల కోసం పని చేస్తుందని అన్నారు. దుపట్ల పంపిణీ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భిక్కు రాథోడ్, ప్రకాష్, హన్మంతు, మహేష్, రంజిత్ ఉన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని యాపల్‌గూడలోని పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి గురువారం పరిశీలించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని పరీక్ష కేంద్రాలను అనుసరిస్తూ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ పరీక్షా కేంద్రంలోని ఏ ఒక్క సిబ్బంది వద్ద కూడా సెల్ ఫోన్లు ఉండరాదని పరీక్షా కేంద్రం ఇన్‌చార్జికి తెలియజేశారు. పరీక్ష మొదలు కాకముందే సిబ్బంది సెల్‌ఫోన్‌లు బయట ఉంచే విధంగా చూడాలని సూచించారు. పరీక్ష కేంద్రం చుట్టూ ఎవరు కూడా ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో ఎటువంటి అత్యావసరమైనా పోలీసు సిబ్బందిని సంప్రదించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఒకటో పట్టణ సీఐ కె.సత్యనారాయణ, మావల ఎస్సైలు విష్ణువర్షన్, ఇసాక్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షకు 47 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 54 పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం నిర్వహించిన పదో తరగతి పరీక్షకు 47 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 10,598 విద్యార్థులకు గాను 10,551 విద్యార్థులు హాజరైనట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత తెలిపారు.

ఘనంగా హనుమాన్ శోభయాత్ర

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను గురువారం నిర్వహించారు. ఈ శోభాయాత్రలో ఎమ్మెల్యే జోగు రామన్న, బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి పాల్గొన్నారు. కాషాయ జెండా ఊపి స్థానిక గోపాలకృష్ణ మఠం నుండి శోభయాత్రను ప్రారంభించారు. సనాతన హైందవ ధర్మరక్షణ కొరకు అందరూ ముందుకు రావాలని హైందవ ధర్మాన్ని కాపాడటం మన కర్తవ్యమని అన్నారు. ఈ ర్యాలీ నేతాజీచౌక్, అంబేద్కర్‌చౌక్, గాంధీ చౌక్, అశోక్ రోడ్, పోలీస్ స్టేషన్ మీదుగా వినాయకచౌక్ వరకు నిర్వహించారు. దీనికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.

అనునిత్యం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 07 మార్చి 2023

ఓడీఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ప్రతి గ్రామాన్ని ఓడిఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ సమన్వయ కార్యకర్త రాజేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, కార్యదర్శులు, జాతీయ ఉపాధి హామీ అసిస్టెంట్లు డీఏలకు స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ రెండో విడతలో భాగంగా చేయవలసిన పనుల గురించి మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. మొదటి దశలో భాగంగ బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా తీర్చి దిద్దడానికి, ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తర్వాత ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా తీర్చి దిద్దడానికి చేయవలసిన అంశాలు దానికి సంంధించి అమలు చేయాల్సిన విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ రాణి, ఎంపిఓ రమేష్, ఏపీఓ రవీందర్ పాల్గొన్నారు.

కాసిపేట-2 ఇంక్లైన్‌పై టీబీజీకేఎస్ గేట్ మీటింగ్

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ మాట్లాడుతూ టీబీజీకేఎస్ కృషి ఫలితంగానే కార్మికులకు పదోన్నతులు వచ్చాయన్నారు. 2 ఇంక్లైన్ గనిలో ఇంటర్నల్ రోడ్లు వేయించామన్నారు. బ్యాంక్ హెడ్ షెడ్, టబ్ రిపేర్ షెడ్డు త్వరలో పూర్తి అవుతాయని తెలిపారు. త్వరలో మ్యాన్ రైడింగ్ కోసం కృషి చేస్తామని వివరించారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకునేది టీబీజీకేఎస్ మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికల సంపత్, ఏరియా కార్యదర్శి వొడ్నాల రాజన్న, ఫిట్ సెక్రెటరీ కారుకూరి తిరుపతి, రమణ, రాజిరెడ్డి, బైరి శంకర్, సిగ్గం శ్రీనివాస్, సారంగపాణి, గోపాల కృష్ణ, గణపతి, తిరుపతి, రమేశ్, పర్వతాలు, రాజేందర్, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని కండక్టర్ దుర్మరణం

నవతెలంగాణ-మంచిర్యాల, తలమడుగు



మంచిర్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో గంగారం(52) అనే కండక్టర్ దుర్మరణం చెందారు. ఆదిలాబాద్‌కు చెందిన గంగారం భోజనం ముగించుకొని తన బస్సు వద్దకు వెళుతుండగా అదే సమయంలో డిపోలోకి వచ్చిన మంచిర్యాల డిపోకు చెందిన బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఆర్టీసీ అధికారులతో పాటు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం గురించి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామంలో విషాదఛాయలు

మంచిర్యాల ప్రమాదంలో మృతిచెందిన కండక్టర్ స్వగ్రామం తలమడుగు మండలం బరంపూర్. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న గంగారాం మృతిచెందడం కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. అందరితో కలుపుగొలుపుగా, స్నేహంగా ఉండే వ్యక్తి ఇలా ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

'బీజేపీ హఠావో దేశ్‌కు బచావో' పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-జన్నారం

సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి మే 15 వరకు నిర్వహించే ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా రూపొందించిన 'బీజేపీ హటావో దేశ్‌కు బచావో' పోస్టరను సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళిందర్‌ఖాన్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు విజయవంతం చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ప్రతి గ్రామంలో బీజేపీ విదానాలను ఎండగట్టాలన్నారు. మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడించి వామపక్ష ప్రగతిశీల లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో కూడిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దాసరి తిరుపతి, మండల కన్వీనర్ మామిడి విజయ్, జిల్లా సమితి సభ్యులు దేవి పోచన్న, చాడ మహేందర్‌రెడ్డి, నాయకులు సంబారి ప్రశాంత్, నెరెళ్ల నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

10న దళిత సంఘాల సమావేశం

నవతెలంగాణ-జన్నారం

హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ఈనెల 10న నిర్వహించే దళిత సంఘాల సమావేశానికి తరళిరావాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రావణ్, సంజీవ్‌లు కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల జిల్లా నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రజా సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని అన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, ఏర్పాటు చేయడం, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం అభినందనీయమన్నారు. ఈ ప్రత్యేక సమావేశానికి దళిత సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని కోరారు.

విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ

నవతెలంగాణ-భీమిని



భీమిని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు శ్రీరామ సేవా సమితి, భీమిని ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి ఆధ్వర్యంలో అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పెద్దపేట గ్రామానికి చెందిన యువకుడు అక్బర్ భాష సహ కారం అందించారు. లక్ష్మణ్, తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఎస్సై మహేందర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు ప్రతి రోజు సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం అందజేస్తామని ఎంపీపీ తెలిపారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పేపర్ లీకులు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బండి సంజయ్ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అక్కెపల్లి లక్ష్మీ, గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, బీఆర్ఎస్ నాయకులు ఎస్కే కరీం, దుర్గం రాంచందర్, మల్లేశ్, రాజన్న, బుగ్గ రాజు, లంక లక్ష్మణ్, పాశం పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీజేపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సతిష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్ ఖండ్రే, మండల అధ్యక్షుడు గణేష్, ఎస్సీ మొర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జైరాజ్, మండల ప్రధాన కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-కాసిపేట

మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ ఎంఏ అలీం కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ఉపాధి హామీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివద్ధి పనుల వివరాలు, పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఈజీఎస్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టే, నిర్వహించే పనులపై సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు పాల్గొన్నారు.

నేలరాలిన మామిడి పంట

- బీమా ఎత్తివేసిన ప్రభుత్వం
- అకాల వర్షాలకు 50 శాతం నష్టం
- ఆందోళనలో రైతులు



నవతెలంగాణ-తాండూర్

గత రెండు రోజుల్లో కురిసిన అకాల వర్షాలకు నియోజకవర్గంలో మామిడి పంట నేలరాలింది. చేతికి అందిందని ఆశించిన మామిడి నేలరాటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాసుల వర్షం కురిపిస్తుందని ఆశించిన మామిడి అకాల వర్షాలకు నేలరాడడంతో మామిడి రైతులు మన స్తాపం చెందుతున్నారు. ప్రభుత్వం మామిడి పంటపై బీమా ఎత్తివేయడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు ఆవేదన



వ్యక్తం చేస్తున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని బెల్లంపల్లి, తాండూర్, భీమిని, కన్నెపెల్లి, కాసిపేట, వేమనపల్లి మండలాల్లో మొత్తం 11,000 ఎకరాల్లో మామిడి సాగుఅవుతోంది. ఆయా మండలాల్లో 300 మంది రైతులు మామిడి పంటపై ఆదారపడి జీవనం సాగిస్తున్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల మార్కెట్ సౌకర్యం లేకపోవడం, గిట్టు ధర లేకపోవడం వంటి అనేక కారణాలతో మామిడి రైతులు ఏటా నష్టం చవిచూడాల్సి వస్తోంది. విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం భీమా సౌకర్యాన్ని ఎత్తివేయడంతో మామిడి రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఉద్యానవన పంటలకు ప్రభుత్వం అందించే సాయం అరకొరగా ఉండడంతో పండ్లు కూరగాయలకు పెంపకానికి రైతులు ముగ్గు చూపడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో మామిడి రైతులను ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేద, మధ్య తరగతి ప్రజలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని, ప్రజల ఆరోగ్యానికి తెలంగాణ ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో నార్నూర్ మండలంలోని ఖంపూర్ గ్రామానికి చెందిన లచ్చుబాయికి రూ.26,000వేలు, అన్నబాపునగర్ గ్రామానికి చెందిన లావణ్యకు రూ.21,000వేల విలువగల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎఆర్ఎఫ్ ద్వారా రూ.కోట్ల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు మంగ పాల్గొన్నారు.

జన్నారం : ముఖ్య మంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్దిదారులకు రూ.3.55 లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె అందజేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారిని ఆర్థికంగా ఆదుకొంటోందని అన్నారు. ఈ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని పొన్కల్ పైడిపెల్లిలోని హనుమాన్ దేవాలయంలో జక్కు సత్తయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.జనార్ధన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోట్ల రాజేష్‌యాదవ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రియాజుద్దీన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం సతీష్, లక్ష్మీనారాయణ రాకేష్, స్థానిక సర్పంచ్ జక్కు భూమేష్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



జన్నారంలో..

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్



నవతెలంగాణ-వేమనపల్లి

గ్రామాల్లో నేరాలను నియంత్రించేందుకే పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తారని, స్థానికులు పూర్తి సహకారం అందించాలని సీఐ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మామడ గ్రామంలో గురువారం ఏసీపీ నరేందర్ ఆధ్వర్యంలో సీఐ విద్యాసాగర్, ఎస్సై వెంకట్ తమ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత కోసమే పోలీసింగ్ ఉందని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ కూడదని, యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకరావాలని లేదా సమస్యలుంటే 100 నంబర్‌కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెసెజ్లకు స్పందించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. వాహనాలు నడిపే టప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలి అన్నారు. గ్రామాలలో మరింత స్వీయ రక్షణకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

ఒత్తిడిని జయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రతి ఒక్కరు నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని జయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేష్ తెలిపారు. ఈ నెల 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు ఆవరణలో ఆరోగ్యంపై విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతి ఒక్కరికి ఏదో విషయంలో ఒత్తిడి సహజమన్నారు. అటువంటి ఒత్తిడిని జయించి ముందుకు సాగాలని ఆరోగ్యాన్ని మించిన మహాభాగ్యం లేదన్నారు. జూనియర్ సివిల్ జడ్జి షరీనా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పోషకాహారం తీసుకుంటూ చుట్టూ ఉన్న పరిసరాల్లో ఔషధాలను ఉపయోగించాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాబు మాట్లాడుతూ చక్కటి ఆరోగ్య నియమాలు పాటించి నిరంతరం ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఉషారాణి, సువర్ణ, నేహా తస్నీం, అడ్వకేట్లు దీపక్ రావు, నరహరి, జీవీఎస్ ప్రసాద్, విద్యాసాగర్, రాజీవ్‌రెడ్డి, రజిహైదర్, రవీందర్, చరణ్, నగేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

గత మూడు రోజులుగా గోలేటిలోని భీమన్న మైదానంలో కొనసాగుతున్న 34వ శ్రీ వేణుగోపాల్ స్మారక ఫుట్‌బాల్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. రెండు రాష్ట్రాల నుండి 12 జట్లు పోటీలో పాల్గొనగా క్రీడాకారులకు వసతి, ఉచిత భోజన సౌకర్యాన్ని సింగరేణి సంస్థ ఏర్పాటుచేసింది. కాగా గురువారం హైదరాబాద్, కరీంనగర్ జట్ల మధ్య చివరి పోటీ హోరా హోరీగా సాగింది. రెండు పాయింట్ల తేడాతో హైదరాబాద్ జట్టు కరీంనగర్ జట్టుపై గెలుపొందింది. విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుకు బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ షీల్డుతో పాటు రూ.50 వేల నగదు, రన్నరప్‌గా నిలిచిన కరీంనగర్ జట్టుకు షీల్డుతో పాటు రూ.30 వేల నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వచ్చిన క్రీడాకారులతో పాటు సౌకర్యాలు కల్పించిన నిర్వాహకులను అభినందించారు. చైర్మన్ ఎన్ శ్రీధర్ ఐఏఎస్ చొరవతో సింగరేణి సంస్థ క్రీడలను, ప్రోత్సహించేందుకు ముందుంటుందన్నారు. పోటీలో గెలుపోటములు సహజమని, నిత్యం సాధన చేసి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేయస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు, స్పోర్ట్స్ పర్యవేక్షకులు సుందర్‌రాజు, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, సీనియర్ పర్సనల్ అధికారి జీకే కిరణ్‌కుమార్, బెల్లంపల్లి రీజియన్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి చాట్ల అశోక్, స్పోర్ట్స్ సమన్వయ కర్త చంద్రకుమార్ పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు తగిన గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశ పరిపాలన వ్యవస్థకు అవసరమైన రాజ్యాంగాన్ని రచించడంతోపాటు దశ దిశ చూపిన అంబేద్కర్‌కు తగిన గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. మండలంలోని ఈదులవాడ గ్రామంలో ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని గ్రామ సర్పంచ్ భీమేష్ అంబేద్కర్ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ జనరల్ కమిటీ అధ్యక్షుడు బాపూజాడే, సభ్యులు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని 10వ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు జిల్లా కేంద్రంలోని పీటీజీ బాలుర జూనియర్ కాలేజ్, జిల్లా పరిషత్ సెకండరీ బాలుర పాఠశాలలో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పరీక్షల నిర్వహణ గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష నిర్వహణ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి మొబైల్ ఫోన్స్ లోనికి అనుమతి లేదని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున, ఏ సమస్య ఉన్న వెంటనే పోలీస్ అధికారులకు తెలియజేయాలని పరీక్ష నిర్వహణ సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అచ్చేశ్వర రావు, ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, ఆసిఫాబాద్ సీఐ రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగును 18వ వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జంగం కళ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని18వ వార్డు కౌన్సిలర్ ఎలబెల్లి గంటాలమ్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు ప్రజలు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కంటి పరీక్ష చేసుకున్న వారికి వెంటనే కళ్లద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే కంటి శస్త్రచికిత్స అవసరమైన వారిని మంచిర్యాల ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు చేపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఇన్‌ఛార్జి గాండ్ల సమ్మయ్య, కోఆప్షన్ సభ్యుడు యాకూబ్‌అలీ, కౌన్సిలర్లు, యువ నాయకులు కొండ కుమార్, గంగారపు సత్యపాల్, కంటి వెలుగు డాక్టర్ పాటిల్ శ్యామల పాల్గొన్నారు.

సామాజిక సేవే ప్రధాన లక్ష్యం

నవతెలంగాణ-కెరమెరి

సామాజిక సేవ కార్యక్రమాలే లక్ష్యంగా దివ్యశ్రీ ఫౌండేషన్ పనిచేస్తోందని ఆ ఫౌండేషన్ చైర్మన్ దారవత్ ప్రవీణ్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సుల్తాన్‌గూడ లోని నిరుపేద కుటుంబాల యువతి, యువకుల పెళ్ళిళ్ళకు నిత్యావసర సరుకులను అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకతీతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఆపదలో ఉన్న పేద ప్రజలను ఆదుకోవడం సంతృప్తినిస్తుందని తెలిపారు. పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కష్టాల్లోఉన్న వారికి దివ్యశ్రీ ఫౌండేషన్ ఎల్లావేళలా అండగా ఉంటుందని అన్నారు. రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు.కెరమెరి, జైనూర్ పేద కుటుంబాలకు చెందిన యువతి, యువకుల వివాహాలు కొద్ది రోజుల్లో ఉన్నాయనే సమాచారం మేరకు నియోజకవర్గంలోని జైనూర్ మండలంలో చింతకర్ర గ్రామానికి రెండు కుటుంబాలకు, కెరామెరి మండల కేంద్రంలోని సుల్తాన్ గూడకు చెందిన ఏడు కుటుంబాలకు, కుటుంబానికి పది వేల విలువగల నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో దివ్యశ్రీ ఫౌండేషన్ వైస్ చైర్మన్ భీంరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశ్వప్రసాద్‌రావు, పూసం సురేష్, రోహిదాస్, సాలాం, మధు, మెస్రం చిన్ను పవార్, పీతా నాయక్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్, ప్రయివేటు ఉద్యోగి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ గుండి గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి నిజాయితీ చాటుకున్న సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కాగజ్ నగర్ మండలం అందవెల్లి గ్రామానికి చెందిన ధనూర్కార్ పాండు తన బాకీ చెల్లించే నిమిత్తం గుండి గ్రామానికి ఆటోలో వెళుతుండగా 40,000 దారిలో పడిపోయాయి. తర్వాత ఆ రహదారిలో వస్తున్న ఆటో డ్రైవర్ సలీం డబ్బులు గుర్తించి అవి బెల్లంపల్లి ప్రైవేటు ఉద్యోగి మిట్టపల్లి శ్రీకాంత్ కు చెందినవిగా భావించి ఆయనకు అందజేశారు. తర్వాత శ్రీకాంత్ తనవి కావని గ్రామ సర్పంచ్ జావారి అరుణ రవీందర్ లకు అందజేశారు. ఇదే సందర్భంలో రహదారిపై డబ్బుల కోసం రోధిస్తూ కనిపించిన పాండుకు మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ చేతుల మీదుగా ఆ మొత్తాన్ని అందజేశారు. ఇద్దరు తమ నిజాయితీని చాటుకుని డబ్బులు తిరిగి ఇవ్వడంతో బాధితులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆటో డ్రైవర్ సలీం, మిట్టపల్లి శ్రీకాంత్‌ని శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ శ్యామ్ రావు, బురుగుడ ఉప సర్పంచ్ బుజాడి కుమార్, వార్డు సభ్యులు ప్రవీణ్, మల్లేష్, మోహన్, కో ఆప్షన్ సభ్యులు గణపతి, మర్యాల రాజేశ్వర్, సెండే గోండు, గ్రామస్తులు కమలకర్, నవీన్ కుమార్, దక్షిణ మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో ప్రధాన అర్చకుడు శిరీష్ శర్మ, అర్చకులు మహేష్, శ్రీనివాస్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తన చేయడంతో పాటు ఆలయంలో హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్లతో ఆలయ పరిసరాలతో పాటు జిల్లా కేంద్రం హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. హనుమాన్ జయంతి వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మి సోనేరావు దంపతులు కుమారుడు సాయి కుమార్ తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ దండేవిటల్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీటీసీలు కోవ అరుణ, రవాణా శాఖ అధికారి శ్యామ్ నాయక్, డీఎస్పీ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ప్రత్యేక పూజలు నిర్వహించిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, మాజీ ఎంపీపీ బాలేశ్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, నాయకులు గాజుల సత్యనారాయణ, గోపాల్ నాయక్, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, గుండా వెంకన్న, సాయిని రాజశేఖర్, ధర్మపురి వెంకటేశ్వర్లు, మురళీగౌడ్ పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయం, శివకేశవ ఆలయంలో ఉదయం నుండే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవ తెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
4
శుక్రవారం 07 ఏప్రిల్ 2023

ఆసిఫాబాద్‌లో వడగండ్ల వాన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో గురువారం ఒక్కసారిగా వడగండ్ల వాన కురిసింది. మధ్యాహ్నం 12గంటలకు ప్రారంభమైన వడగండ్ల వర్షం మూడు గంటలపాటు ఏకధాటిగా కురిసింది. వర్షంతో జిల్లా కేంద్రం తడిసి ముద్దయింది. అప్పటివరకు ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన జిల్లా కేంద్ర ప్రజలకు వర్షం కొంత ఊరటనిచ్చింది. అకాల వర్షం వల్ల వేసవికాల వరి పంట దెబ్బతినే అవకాశముదంని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కౌటాల : మండలంలోని సాండ్‌గాం గ్రామంలో గురువారం సాయంత్రం కురిసిన గాలి, వానకు పదుల సంఖ్యలో ఇండ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. ఇండ్లలోని వంట సామగ్రి వర్షానికి తడిసిపోయింది. బాధితులకు తీవ్రం నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాదించాలి

నవతెలంగాణ-జైపూర్



ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలు అన్నింటిని సద్వినియోగం చేసుకుంటూ మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధించాలని మంచిర్యాల ట్రైనీ కలెక్టర్ గౌతమి అన్నారు. గురువారం జైపూర్ మండలం టేకుమట్ల ఇందారం గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు నిర్వహిస్తున్న వ్యాపార కార్యక్రమాలను పరిశీలించారు. వ్యాపారాలకు సంబంధించిన వివరాలు ఆర్థిక తోడ్పాటు తదితర విషయాలు మహిళా సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం డీపీఎం వేణు, ఏపీఎం రాజ్‌కుమార్, సిసి దీపక్, స్వర్ణలత పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పకడ్బందీ తనిఖీ

నవతెలంగాణ-భీమారం

పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జైపూర్ ఏసీపీ నరెందర్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పరీక్ష కేంద్రాన్ని శ్రీరాంపూర్ సీఐ రాజుతో కలిసి గురువారం తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఇతర వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సూపరిటెండెంట్‌తో కలిసి పరీక్ష గదులను పరిశీలించారు. వారి వెంట ఎస్ఐ సుధాకర్, జైపూర్ ఎస్ఐ రామకృష్ణ ఉన్నారు.

గడువుకు ముందే ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి



నవతెలంగాణ-నస్పూర్

ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని గడువుకు ముందే సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి తెలిపారు. గురువారం ఆర్కే 5,6 గ్రూప్ ఏజెంట్ కార్యాలయంలో 2023-24 ఆర్థిక సంవత్సర ఉత్పత్తి లక్ష్యాల సాధన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో ఆర్కే 5,6 గ్రూప్ గనులకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఈ గనులు ఏరియాలోనే ఆర్థిక సంవత్సరం ముగింపు కాకముందే తమ ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం ఆనవాయితీగా వస్తుందని, ఇదే ఒరవడిని ఈ ఆర్థిక సంవత్సరం 2023-24 కూడా కొనసాగించాలని పేర్కొన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత సాధించాలని గని అధికారులను ఆదేశించారు. సంస్థ అభివృద్ధి చెందాలంటే వ్యయాలను తగ్గించుకొని ఆదాయాలు పెంచుకోవడానికి ప్రయత్నం చేయాలని, ఎస్డిఎల్ యంత్రాలకు సంబంధించిన పరికరాలు, ఇతర యంత్రాలకు సంబంధించిన పరికరాలను అన్నింటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. యంత్రాలు యంత్ర పరికరాలకు సంబంధించిన ఆవశ్యకతను సంబంధిత ఇంజనీర్లు పరిశీలించి దానికి అనుగుణంగా ప్రణాళికలు వేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంచార్జ్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్కే5,6 గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్, ఆర్కే6 ఇన్చార్జి గని మేనేజర్ కే శ్రీనివాస్, డీజీఎంలు చిరంజీవులు, శివరావు, ఏరియా ఇంచార్జ్ రక్షణాధికారి కె వెంకటేశ్వరరెడ్డి, గని గ్రూప్ ఇంజనీర్ వీరన్న, గని రక్షణాధికారి శివయ్య, ఇంజనీర్లు రాధాకృష్ణ శ్యామ్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, సర్వే అధికారులు వర్మ, కిరణ్ పాల్గొన్నారు.

కుటుంబ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని కర్జెల్లి గ్రామానికి చెందిన అన్నం భీమయ్య(35) గురువారం గ్రామ సమీపంలో గల వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. గత కొన్ని రోజుల నుండి భార్య, భర్తల మధ్య గొడవ జరిగి భార్య తమ బంధువుల ఇంటికి వెళ్ళిపోయింది. ఈ క్రమంలో భీమయ్య మనస్థాపంచెంది వ్యవసాయ భూమిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి బాపు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

యువకులు సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలి



నవతెలంగాణ-కోటపల్లి

యువకులు సంఘ విద్రోహ శక్తులకు సహకరించి జీవితాలు నాశనం చేసుకోవద్దని చెన్నూర్ పట్టణ సీఐ వాసుదేవరావు అన్నారు. మండలంలోని లంబాడీపల్లి గ్రామంలో గురువారం కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫ్రెండ్లీ పోలీసింగ్ చేస్తుందని తెలిపారు. గ్రామాలలో అనుమానంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి బ్యాంక్ వివరాలు, పిన్ నెంబర్ అడిగితే ఇవ్వవద్దని అన్నారు. బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన శిక్ష అనుభవిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎస్ఐలు శ్వేత, సౌజన్య, సర్పంచ్ ఆలోతు లక్ష్మిప్రియ పాల్గొన్నారు.

ప్రయాణికులకు వసతుల కల్పనకు కృషి

- రైల్వే స్టేషన్‌ను సందర్శించిన డీఆర్ఎం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల అవసరమైన వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు డీఆర్ఎం సునితి సర్కార్ తెలిపారు. గురువారం రైల్వే అధికారులతో కలిసి రైల్వే స్టేషన్‌ను ఆమె పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న పిట్ లైన్ పనులను పరిశీలించి, పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైల్వే స్టేషన్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలపై ఆరా తీసి, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే గేట్, ట్రాక్ అవతలున్న కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని రైల్వే డీఆర్ఎం సునితి సర్కార్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి విన్నవించారు. రైల్వే స్టేషన్ వెనుకున్న కాలనీ ప్రజలకు మెరుగైన రవాణా కోసం మార్కెట్ రోడ్డు కనెక్టివిటీని మంజూరు చేయాలని, హింగోలి స్టేషన్‌లో ఉన్న విధంగా మోటర్ సైకిల్ కోసం ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా మరొక టికెట్ కౌంటర్, పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాలపై డీఆర్ఎం సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల సాధనపై గురువారం కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న 7,500 ఉద్యోగాలకు ఇటీవల స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సును నిర్వహించారు. డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ విభాగం తరపున అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపల్ డి లక్ష్మీనరసింహం తెలిపారు. ఎంపిక విధానం, సిలబస్, దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు.

11న ద్విచక్ర వాహనాల వేలం పాట

నవ తెలంగాణ-లక్షెట్టిపేట

ప్రోహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో వివిధ కేసులలో జప్తు చేయబడిన 11 ద్విచక్ర వాహనములకు ఈ నెల 11న ఉదయం 11గంటలకు జిల్లా ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ప్రోహిబిషన్ ఎక్సైజ్ సీఐ బాబా తెలిపారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనవచ్చునని, వాహనాలకు సంబంధించి పూర్తి వివరాలకు స్థానిక స్టేషన్ లో సంప్రదించాలన్నారు.

మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసనలు

నవతెలంగాణ-కాసిపేట

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 8న తెలంగాణ పర్యటనను వ్యతిరేకిస్తూ సింగరేణి బొగ్గు గనులపై కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ ఆధ్వర్యంలో మోడీ విదానాలను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను ప్రైవేటుకు కట్టబట్టేందుకు కుట్రలకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు, జెండాలతో నిరసన ప్రదర్శనలు చేయాలని కార్మికులకు పిలుపు నిచ్చారు.

పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వొద్దు

- అదనపు కలెక్టర్ నటరాజన్



నవతెలంగాణ-తాంసి

పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్న తరుణంలో పరీక్ష కేంద్రాలలో మాస్ కాపీయింగ్‌కు ఎట్టి పరిస్థితుల్లో ఇన్విజిలేటర్లు అవకాశం ఇవ్వొద్దని అదనపు కలెక్టర్ నటరాజన్ పరీక్ష నిర్వహణ సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత హైస్కూల్‌లో జరుగుతున్న పదో తరగతి పరీక్షల కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాయాలని, ఏటువంటి ఒత్తిడికి గురి కావద్దని అన్నారు. ముఖ్యంగా తమ సొంత మేధస్సుతో పరీక్షలు రాయాలని అన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడ వద్దని, కేంద్రాల్లో తాగునీరు, ఆరోగ్య సిబ్బంది, అందుబాటులో ఉండాలని అన్నారు. ఇన్విజిలేటర్లు సెల్ ఫోన్లు వాడవద్దని బయట వ్యక్తులను లోనికి రాకుండా పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి ఉన్నారు.

ప్రాజెక్టు అధికారిని కలిసిన ఏఐటీయూసీ నాయకులు



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓసీలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రాజెక్టు ఆఫీసర్ నాయిని ఉమాకాంత్‌ను గురువారం ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి సోమవారం తిరుపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి రెహమాన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారి వెంట మారం శ్రీనివాస్, ఖైరిగూడ ఫిట్ సెక్రటరీ జూపాక రాజేష్, నాయకులు దేవి శ్రీనివాస్, రాంకిశన్, ఓదెలు పాల్గొన్నారు.

సంక్షేమ అధికారుల పాత్ర కీలకం



నవతెలంగాణ-నస్పూర్

ఉద్యోగులకు సంక్షేమ ఫలాలు అందించడంలో సంక్షేమ అధికారుల పాత్ర కీలకమని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి అన్నారు. గురువారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు, అన్ని గనుల సంక్షేమ అధికారులతో జనరల్ మేనేజర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి సంక్షేమ అధికారులందరూ కృషి చేయాలని తెలిపారు. మరణించిన, పదవీ విరమణ పొందిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు సంబంధించిన సెటిల్మెంట్ పనులను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని సూచించారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న యువతీ యువకుల హాజరు శాతం పెంచడానికి, వారికి అవగాహన కల్పిస్తూ ఉండాలని సూచించారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలపై కాంట్రాక్టర్‌కు, కాంట్రాక్టు ఉద్యోగులకు తెలియపరుస్తూ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ పి.అరవిందరావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, రాజేశ్వరరావు, రాజేష్, దేవేందర్‌రెడ్డి, కాంతారావు, ప్రకాష్, అన్ని గనుల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పంట దగ్ధం



నవతెలంగాణ-లోకేశ్వరం

కష్టపడి పండించిన పంట ఇంకో వారం రోజుల్లో చేతికొస్తుందన్న సమయంలో గురువారం షార్ట్ సర్క్యూట్‌తో పంట కాలి బూడిదైన సంఘటన మండలంలోని సాత్గాం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాత్గాం గ్రామానికి చెందిన గౌరోల్ల పెద్ద భూమన్న రైతు తన చేనులో ఒక ఎకరం మొక్కజొన్న పంటను వేసి సాగుచేస్తున్నాడు. పంట కోతకు వస్తుందన్న సమయంలో తన చేన్‌లో బిగించి ఉన్న ట్రాన్స్ ఫార్మర్ షాక్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పంట కాలిపోయింది. పంట నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రెవెన్యూ సిబ్బంది పంట స్థలాన్ని పరిశీలించి, పంచనామ నిర్వహించి, ఇప్పటివరకు భూమన్న రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు, ఆశించిన మేరకు దిగుబడి వస్తే రూ.50 నుండి 60 క్వింటాళ్ల మధ్య పంట చేతికొచ్చేదని తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీలో కంటి వెలుగు కేంద్రాన్ని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, వైద్యుడు కుమారస్వామి సందర్శించారు. కంటి వెలుగు సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో గుండెపోటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు(సిపిఆర్)పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి తాండూర్ సత్యనారాయణ, ఏపిఓ నందకుమార్, ఈసి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలకేంద్రంలో నిర్వహిస్తున్న పదో తరగతి వార్షిక పరీక్ష కేంద్రాలను ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా జాగ్రత్తలు పాటిస్తూ ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో అధికారులందరు కలిసి విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. పరీక్షలు ముగిసే వరకు నాలుగు పరీక్ష కేంద్రాల్లో ప్రత్యేకాధికారులుగా తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీఓ రాజేశ్వర్, ఎస్సై దీకొండ రమేష్, అదనపు ఎస్సై రాకేష్ వీరితో పాటు ఎంఈఓ సోమయ్య పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మౌళిక సదుపాయాలు కల్పించాలని, పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా పర్యవేక్షించాలని ఉపాధ్యాయులకు, అధికారులకు సూచించారు.

బీజేపీలో చేరిన స్వతంత్ర కౌన్సిలర్



నవతెలంగాణ-నస్పూర్

16వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ బద్రి శ్రీకాంత్ గురువారం బిజెపిలో చేరాడు. జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధానమంత్రి బడుగు బలహీన వర్గాలకోసం చేస్తున్న మంచి పనులు, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ బీఆర్ఎస్ అవినీతిపై చేస్తున్న పోరాటానికి ఆకర్షితుడనై పార్టీలో చేరానని శ్రీకాంత్ ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జోగుల శ్రీదేవి, జిల్లా నాయకులు బరుపటి మారుతి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు బొద్దున మల్లేష్, పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాగుల రాజన్న, నస్పూర్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సత్రం రమేష్, నస్పూర్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు సిరికొండ రాజు, తిప్పని భీమయ్య పాల్గొన్నారు.

మోడీ పర్యటనకు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపాలి

నవతెలంగాణ-జైపూర్

ఈ నెల 8న తెలంగాణకు వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవడాన్ని వ్యతిరేకించాలని, బొగ్గు గని కార్మికుల 11వ వేజ్ బోర్డు సమస్యను వెంటనే పరిష్కరించాలన్న డిమాండ్‌తో నిరసన ప్రదర్శన చేపట్టాలని కోరారు. అదానికి వేల కోట్లు లాభం చేకూర్చడం కోసం విదేశీ బొగ్గు 10 శాతం కొనుగోలును వ్యతిరేకించాలని తెలిపారు. నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలతో సింగరేణి వ్యాప్త అన్ని బొగ్గు బావులు, డిపార్ట్‌మెంట్ల వద్ద నిరసన ప్రదర్శనలు చేపట్టాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలోని కేకే గార్డెన్‌లో ఈ నెల 7వ తేదీన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జిల్లా పరిషత్ చైర్మన్ కోవలక్ష్మి, ఆసిఫాబాద్ శాసనసభ్యుడు ఆత్రం సక్కు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్సీ దండె విఠల్ పాల్గొననున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతి

నవతెలంగాణ-సారంగాపూర్



మండల కేంద్రానికి చెందిన ఉడత గణేష్(14) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్టు ఎస్సై కృష్ణా సాగర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మృతుడు గణేష్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూనే కుటుంబ పోషణకు బారం కాకుండా స్థానిక టెంట్‌హౌస్‌లో పార్ట్‌టైం జాబ్ చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం టెంట్ యజమాని టెంటు సామగ్రి కడగటానికి సమీప చెరువులోకి గణేష్‌ను తీసుకువెళ్లాడు సామాను కడుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు నీటమునిగి బాలుడు మృతి చెందాడు. మృతికి కారణమైన టెంట్ యజమానిపై చర్యలు తీసుకోవాలని తల్లి స్వప్న ఫిర్యాదు చేశారు. బాలుడి మృతదేహాన్ని జాలర్ల సాయంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి కొన్ని రోజుల కింద అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి స్వప్న ఒక అక్క, తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. ఇంటికి పెద్దకొడుకు మృతి చెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

నవతెలంగాణ-ఖానాపూర్

వృద్ధాప్య పెన్షన్ తీసుకొని తిరిగి వస్తుండగా విద్యానగర్ సమీపంలో గురువారం ట్రాక్టర్ ట్రాలీ తగిలి కింద పడటంతో తలకు తీవ్ర గాయమై ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని పద్మావతి నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ పట్టణంలోని పద్మావతినగర్‌కు చెందిన కారింగుల ధర్మపురి(70) పెన్షన్ కోసమని పోస్ట్ ఆఫీస్ వెళ్లి పెన్షన్ తీసుకొని తిరిగి ఇంటికి వెళుతుండగా విద్యానగర్ సమీపంలో అటుగా వస్తున్న ట్రాక్టర్ ట్రాలీ స్కూటీకి తగలడంతో కిందపడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయమైంది. దీని గమనించిన స్థానికులు క్షతగాత్రున్ని108 వాహనం సహాయంతో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వ్యక్తికి మూడేండ్ల జైలు

నవతెలంగాణ-భీమారం

బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జిల్లా సెషన్ జడ్జి జె.మైత్రేయి 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించినట్టు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రానికి చెందిన తువ్వ రాజయ్య 3సంవత్సరాల క్రితం ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై బి.సంజీవ్ కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. గురువారం 12 మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయించారు.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

హన్మాన్ జయంతిని పురస్కరించుకొని బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గురువారం కాగజ్‌నగర్‌లో నిర్వహించిన శోభాయాత్ర ఘనంగా కొనసాగింది. ఉదయం 11 గంటలకు ఈ శోభాయాత్రను స్థానిక హన్మాన్ మందిర్ వద్ద ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభించగా ఎమ్మెల్సీ దండె విఠల్, బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు హాజరయ్యారు. చంద్రాపూర్ నుండి వచ్చిన ప్రత్యేక డోలు బృందం డోలు వాయిద్యాల మధ్య ఈ శోభాయాత్ర కొనసాగింది. పట్టణంలోని రాజీవ్‌చౌక్, ప్రధాన మార్కెట్, అంబేద్కర్ చౌక్ మీదుగా ఈ శోభాయాత్ర తిరిగి హన్మాన్ మందిర్ చేరుకుంది. మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగిన ఈ శోభాయాత్రతో పట్టణమంతా కాషాయమయంగా మారింది. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్‌రావు ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో సీఐ బుద్దె స్వామి, డివిజన్‌లోని ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు. కాగా శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు పలు రాజకీయ పార్టీల నాయకులతో పాటు వివిధ సంఘాల నాయకులు వాటర్‌ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అరటిపండ్లు, ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు.

పెంచికల్‌పేట్ : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆభయాంజనేయ స్వామి విగ్రహం నుండి మండలంలోని పలు వీధుల గుండా శోభాయాత్ర, ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఆభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జెడ్పీటీసీ సముద్రాల సరిత రాజన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్ర అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, భక్తులు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలో గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ భక్తులు మోటార్ సైకిళ్లతో శోభాయాత్ర నిర్వహించారు. రంగనాయక ఆలయం ప్రాంగణం నుండి శోభాయాత్ర ఎలుకపెల్లి, చిన్న సిద్దాపూర్, నాగుల్వాయి, కృష్ణపెల్లి మీదుగా పాపన్నపేట వరకు కొనసాగింది. మండలంలోని ఎలుకపెల్లి, చిన్న సిద్ధాపూర్, కృష్ణపెల్లి, బెజ్జూర్ ఆలయాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో హనుమాన్ జెండాను ఎగరవేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కౌటాల : హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలో గురువారం హనుమాన్ భక్తులు గ్రామాల్లో హనుమాన్ శోభాయాత్రలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు అంబేద శంకరయ్య, సంతోష్, కంకలమ్మ ఆలయంలో బృందావనం శ్రీ రాధాకృష్ణ, ఆశ్రమం పండితులు శివరాం స్వామి, తలోడి హనుమాన్ ఆలయంలో ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ శర్మతో పాటు పలు గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో పూజారులు ప్రత్యేక పూజా, హనుమాన్ జెండా ఆవిష్కరించారు. మండలంలోని తలోడి గ్రామంలో పవనసుత యూత్ ఆధ్వర్యంలో సాయంత్రం తలోడి హనుమాన్ ఆలయం నుండి కౌటాల సాయిబాబా ఆలయం వరకు సాంప్రదాయ మంగళ వాయిద్యాలు, ఆటలు, పాటలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రను కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐ ప్రవీన్‌కుమార్ హనుమాన్ జెండా ఊపి ప్రారంభించారు. శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మజ్జిగ పంపిణీ చేయగా పలువురు పండ్లు, బిస్కెట్‌లు అందజేశారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

నిర్మల్ : జిల్లా కేంద్రంతో పాటు మండలంలో హనుమాన్ ఆలయాల్లో జయంతి వేడుకలు గురువారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు వార్డు, ఆలయ కమీటీ సభ్యులు ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నిర్మల్ మండలంలోని ఎల్లపల్లిలోని హనుమాన్ దేవాలయాన్ని, జిల్లా కేంద్రంలోని కురన్నపేట, బాలాజీవాడ, గాంధీచౌక్, గాజులపేట్, చింతకుంట వాడ, భాగ్యనగర్, కళానగర్, ప్రియదర్శిని నగర్, శాస్త్రి నగర్ వార్డులలోని హనుమాన్ ఆలయాల్లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ఎఫ్ ఎస్‌సీఎస్ చైర్మెన్ రాజేందర్, ఎల్లపల్లి సర్పంచ్ రవీందర్‌రెడ్డి, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : హనుమాన్ జయంతి వేడుకలను మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రతి గ్రామంలో జయంతి కార్యక్రమాలు చేపట్టారు. ఉట్నూర్ పట్టణంలోని వినాయక్‌చౌక్‌లో ఉన్న హనుమాన్ దేవాలయంలో జయంతిని సందర్భంగా ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. హనుమంతుడుకి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు మహారాష్ట్ర నుండి వచ్చిన ప్రత్యేక కళాకారులు డ్రమ్స్ వాయిస్తూ భారీ శోభాయాత్ర చేపట్టారు. ఈ శోభాయాత్రలో పట్టణమంతా కాషాయం జెండాలతో కిక్కిరిసిపోయింది. భక్తులు, హనుమాన్ దీక్ష పరులు, ప్రజలు ఘానంవరాన్ నామస్మరణలతో మారుమోగింది. పట్టణంలో పలు దుకాణాదారులు చల్లని నీటిని సరఫరా చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మహేశ్ ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగను అందించారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం దేవాలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. హనుమాన్ జయంతి సందర్భంగా జెడ్పి చైర్మన్ రాథోడ్ జనార్ధన్ పూజలు చేశారు. శోభాయాత్రలో మహారాష్ట్ర నుంచి వచ్చిన ప్రత్యేక కళాకారుల నృత్యాలు పలువురి చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

నార్నూర్ : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు భక్తులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని వీరాంజనేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు పూజలు చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. హనుమాన్ దీక్ష పరులు దీక్షను విరమించారు.

ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలోని పలు ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్, శాంతినగర్ హనుమాన్ దేవాలయాల్లో పురోహితులు రాజశేఖర్ శర్మ ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేఖా నాయక్ పట్టణంలోని పలు ముఖ్య ఆలయాల్లో హనుమంతున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వేద పండితులు ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సిరికొండ : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోంపల్లి, పొన్న, రాయిగూడ, రాంపూర్, పోచంపల్లి, తదితర గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రంలోని బోయవాడ కాలనీవాసులు, పల్లకి ఊరేగింపు నిర్వహించారు.

బాసర : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను హనుమాన్ మందిరాల్లో ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే హనుమాన్ ఆలయాలను అందంగా ముస్తాబు చేసి హనుమాన్ ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆయా కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంది.

తాంసి : హనుమాన్ జయంతిని పురస్కారరించుకొని గురువారం తాంసి, భీంపూర్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఆంజనేయ స్వామి మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం రాత్రి తాంసి మండల కేంద్రంలోని అభయ ఆంజనేయంలో సిందూర అభిషేకం నిర్వాణతో పాటు కౌట ప్రభాకర్ బృంద అధ్వర్యంలో భజన నిర్వహించారు. వేద పండితులు సతీష్ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం పొన్నారి హనుమాన్ ఆలయంలో జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ ప్రత్యేక పూజలు చేశారు.

ఆదిలాబాద్‌టౌన్ : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని అదిలాబాద్ పట్టణంలోని పలు హనుమాన్ ఆలయాల్లో మున్సిపల్ చైర్మెన్ కాలనీ వాసులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట సొంత వార్డులోని శాంతినగర్ హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఇంద్రానగర్‌లోని వీరాంజనేయ స్వామి, మహాలక్ష్మి వాడలోని హనుమాన్ ఆలయం, అనంతరం వడ్డెర కాలనీలోని విజయాంజనేయ స్వామి ఆలయాలను సందర్శించుకున్నారు. అనంతరం అన్నదాన సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని పిట్టలవాడ కాలనీలోని హనుమాన్ మందిరం ఆలయంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలానికి చెందిన గాజరి జగదీష్ సుజాత దంపతులు ప్రత్యేక హోమం నిర్వహించారు. పండితులు సంతోష్ వేద మంత్రోచ్చారణల మధ్య కన్నుల పండువగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకొని అన్నదానం కార్యక్రమం పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ ఆవిర్భావించిన రోజు అని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ అన్నారు. గురువారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా పార్టీ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 కోట్ల కార్యకర్తలు గల భారతీయ జనతా పార్టీ కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని ఇది ఒక కుటుంబం లాంటిదని అన్నారు. బీజేపీలో పని చేసే ప్రతి ఒక్క కార్యకర్త దేశ సేవలో సామాజిక సేవలో లీనమైపోతాడని అన్నారు. భారతీయ జనతా పార్టీలో పనిచేసే ఒక సాధారణ కార్యకర్త కూడా ప్రధానమంత్రి స్థాయికి ఎదగగలిగే పరిస్థితి బీజేపీలో మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, పట్టణ జిల్లా నాయకులు లాలా మున్నా, జోగు రవి, ఆదినాథ్, అంకత్ రమేష్, రఘుపతి, చిలుకూరి జ్యోతిరెడ్డి, మేకల సూర్యకిరణ్, రాము, భార్గవ్, రత్నాకర్‌రెడ్డి, కృష్ణ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : బీజేపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలలో నాయకులు జెండావిష్కరణ చేపట్టారు. స్థానిక 76వ బూత్ పరిధిలో, ఎన్జీఓస్ కాలనీలో జెండాలను ఆవిష్కరించగా దీనికి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు హాజరయ్యారు. అదేవిధంగా స్థానిక ప్రజా కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు జెండావిష్కరించారు. అనంతరం బీఆర్ఎస్ అవినీతి, నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాండూర్ : భారతీయ జనతా పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తాండూరు మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని మోడీనగర్‌లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్గం తిరుపతి పార్టీ జెండా విష్కరించారు. అనంతరం బీజేపీ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, మండల ప్రధాన కార్యదర్శిలు దూడపాక భరత్, పట్టెం విష్ణు, కళ్యాణ్, మండల ఉపాధ్యక్షులు కోమండ్ల శ్రీనివాస్, చజనాల రాహుల్, మండల కార్యదర్శి పుట్ట కుమార్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఏముర్ల ప్రదీప్ సీనియర్ నాయకులు సిద్ధం మల్లేష్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : బీజేపీ పార్టీ అవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని జాం గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా మండల బీజేపీ పార్టీ కన్వీనర్ కర్పె విలాస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే బలమని, దేశంలో ఎందరో కార్యకర్తల త్యాగంతోనే ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా గుర్తింపు పొందిదని అన్నారు. రానున్న ఎన్నికల్లో భాగ్య నగరం గోల్కొండ కోటాపై బీజేపీ జెండా ఎగురవేయడం లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆడేపు మహేందర్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తిరుమల చారి, బూత్ అధ్యక్షులు బలస్ట్ నవీన్, బండి సురేష్, జాదవ్ ధనరాజ్, గంధం సురేష్, జీవన్, గంగాధర్, రవితేజ, తెడ్డు నర్సయ్యలు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండలంలో బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలో ఉపాధ్యక్షులు గుడ్ల రంజిత్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు.

ఆదిలాబాద్‌రూరల్ : బీజేపీ పార్టీ అతిపెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భావించిన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ మాట్లాడుతూ మావల మండలంలోని పోలింగ్ బూత్‌లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా పార్టీ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 కోట్ల కార్యకర్తలు గల భారతీయ జనతా పార్టీ కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని ఇది ఒక కుటుంబం లాంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రనాయకురాలు చిట్యాల సుహాసిని రెడ్డి, రఘుపతి, గంగారెడ్డి, భార్గవ్, చిలుకూరి జ్యోతిరెడ్డి, రవిరెడ్డి, సతీష్, నవీన్, వెంకట్, రమేష్ పాల్గొన్నారు.

బాసర : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కార్యకర్తలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణను నిర్వహించి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ బూత్‌లో పార్టీ జెండాలను ఆవిష్కరించడం జరిగిందని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లస్మరెడ్డి, అంతగిరి రాజన్న, సుద్ద సాయిబాబా, దేవునే శంకర్, బిదుర్ రమేష్, జిడ్డు సుభాష్ పాల్గొన్నారు.